# పెట్రో గుట్టు.. గ్రోక్ రట్టు!

> మొదటిపేజీ తరువాయి...
డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని రూ. 2 చొప్పున మోదీ ప్రభుత్వం ఎందుకు పెంచింది? దీంతో ఖజానాకు ఏ మేరకు ఆదాయం రానున్నది?

• **గ్రోక్:** ఆదాయాన్ని పెంచుకోవడానికే కేంద్ర ప్రభుత్వం రూ. 2 చొప్పున ఎక్సైజ్ సుంకాన్ని పెట్రోల్, డీజిల్‌పై వడ్డించింది. దేశంలో రోజుకు 9 కోట్ల లీటర్ల పెట్రోల్, 30 కోట్ల లీటర్ల డీజిల్ వినియోగిస్తున్నారు. తాజా పెంపుతో కేంద్రానికి రోజుకు రూ. 780 కోట్ల ఆదాయం వస్తుంది. ఏడాదికి ఇది రూ. 2.85 లక్షల కోట్లుగా చెప్పొచ్చు.

**ప్రశ్న: ఎక్సైజ్ సుంకం పెంపు పేరిట మోదీ ప్రభుత్వం సామాన్యులను మోసం చేస్తున్నదన్న వాదనలు వినిపిస్తున్నాయి. నిజమేనా?**

• **గ్రోక్:** నిజమే. దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు అంతర్జాతీయ క్రూడాయిల్ ధరలపై ఆధారపడి ఉంటాయి. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ క్రూడాయిల్ 60 డాలర్లకు పడిపోయింది. ఇది నాలుగేండ్ల కనిష్ఠం. ఈ లెక్కన దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు కూడా తగ్గాలి. అయితే, ఆ తగ్గింపు ప్రయోజనాలను వినియోగదారులకు బదిలీ చేయకుండా.. ఎక్సైజ్ సుంకం పెంపు పేరిట ఆ లాభాన్ని కేంద్రం ఖజానాకు మళ్లిస్తోన్నది.

**ప్రశ్న: ఏ ప్రధానమంత్రి హయాంలో దేశంలో పెట్రోల్ ధరలు భారీగా పెరిగాయి?**

• **గ్రోక్:** మోదీ ప్రభుత్వ హయాంలో పెట్రోల్ ధరలు భారీగా పెరిగాయి. 2021లో లీటర్ పెట్రోల్ 130 వరకూ వెళ్లింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 30 డాలర్లకు పడిపోయినప్పటికీ బీజేపీ ప్రభుత్వం పెట్రోల్ ధరలను తగ్గించలేదు. సర్దుబాటు పేరిట ఎక్సైజ్ ఇతరత్రా సుంకాలను పెంచింది.

**ప్రశ్న: మోదీ ప్రభుత్వ హయాంలో పెట్రో ధరలు ఎలా పెరిగాయి?**

• **గ్రోక్:** 2014 మేలో మోదీ ప్రధానిగా పగ్గాలు చేపట్టినప్పుడు అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు బ్యారెల్‌కు 105–110 డాలర్ల మధ్య ఉండేది. అప్పుడు లీటర్ పెట్రోల్ రూ. 71.51, లీటర్ డీజిల్ రూ. 57.28గా ఉండేది. అయితే, ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల ముడిచమురు 60 డాలర్లకు లభిస్తున్నా లీటర్ పెట్రోల్ ధర రూ. 107కు చేరింది. లీటర్ డీజిల్ రూ. 95గా ఉన్నది. 2014 నుంచి 2025 వరకూ పెట్రోల్ ధర 40 శాతం మేర, డీజిల్ ధర 60 శాతం మేర పెరిగింది. 2014లో పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకం వరుసగా రూ. 9.48, రూ. 3.57గా ఉండగా తాజా పెంపుతో ఇది ప్రస్తుతం వరుసగా రూ. 13, రూ. 10కి చేరింది.




## రష్యా తరఫున యుద్ధంలో చైనా సైనికులు

**ఇద్దరిని పట్టుకున్నామన్న ఉక్రెయిన్**

కీవ్: రష్యా తరఫున యుద్ధంలో పాల్గొని తమపై పోరాడుతున్న ఇద్దరు చైనా సైనికులను తమ సైన్యం పట్టుకుందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ వెల్లడించారు. దొనెట్స్క్ ప్రాంతంలో పట్టుబడ్డ వారిద్దరి నుంచి ఐడెంటిఫికేషన్ పత్రాలను, బ్యాంక్ కార్డులను కూడా స్వాధీనం చేసుకున్నామని, వారు చైనా పౌరులే అన్న విషయం వాటి ద్వారా నిర్ధారణ అయ్యిందన్నారు. కేవలం వీరిద్దరే కాక, చాలామంది చైనా సైనికులు ఆక్రమిత యూనిట్లలో ఉన్నట్టు గుర్తించామన్నారు. దీనిపై చైనాను వివరణ అడగాలని తమ విదేశాంగ శాఖ మంత్రిని ఆదేశించినట్టు చెప్పారు.

## రేప్ చేసి.. గొంతు కోసి

- ఆరో అంతస్తు నుంచి తోసేసి
- పదేండ్ల బాలికపై ఘాతుకం

థాణె, ఏప్రిల్ 8: బీజేపీ పాలిత మహారాష్ట్రలోని థాణె నగరంలో దారుణం చోటుచేసుకుంది. ఓ పదేళ్ల బాలికను కిడ్నాప్ చేసి లైంగికదాడికి పాల్పడిన ఓ యువకుడు ఆ బాలిక గొంతు కోసి ఆరవ అంతస్తులో ఉన్న తన ఫ్లాట్ కిటికీ నుంచి కిందకు విసిరేశాడని పోలీసులు మంగళవారం తెలిపారు. ముంబ్రా ప్రాంతంలోని సామ్రాట్ నగర్‌లో ఉన్న 10 అంతస్తుల భవనంలో సోమవారం రాత్రి ఈ దారుణ ఘటన జరిగినట్టు వారు చెప్పారు. నిందితుడు 20 ఏళ్ల ఆసిఫ్ అక్బర్ మన్సూరీని పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడు బీహార్‌లోని సుల్తాన్‌పూర్‌కు చెందినవాడు

# 3 నెలల్లో తేల్చాల్సిందే

- బిల్లులను నిరవధికంగా పెండింగ్‌లో ఉంచరాదు
- గవర్నర్లు చట్టానికి అతీతులు ఏమీ కారు
- రెండోసారి వచ్చిన బిల్లులు వాపసు చేయరాదు
- బిల్లును తిరస్కరించే అధికారం గవర్నర్లకు లేదు
- తమిళనాడు గవర్నర్ చర్యలు రాజ్యాంగ విరుద్ధం
- సర్వోన్నత న్యాయస్థానం చారిత్రాత్మక తీర్పు





### ఇది రాష్ట్ర ప్రభుత్వాల విజయం: స్టాలిన్

రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన బిల్లులపై సమ్మతి తెలియచేయకుండా తమిళనాడు గవర్నర్ రవి పెండింగ్‌లో ఉంచడంపై సుప్రీంకోర్టు మంగళవారం వెలువరించిన తీర్పును సీఎం స్టాలిన్ స్వాగతించారు. ఈ తీర్పును చారిత్రాత్మకంగా అభివర్ణించిన స్టాలిన్.. ఇది రాష్ట్ర ప్రభుత్వాల విజయంగా పేర్కొన్నారు. బిల్లులకు గవర్నర్ సమ్మతి తెలియచేసినట్టు పరిగణించాలని సుప్రీంకోర్టు తన తీర్పులో పేర్కొందని అసెంబ్లీలో మాట్లాడుతూ స్టాలిన్ తెలిపారు. డిప్యూటీ సీఎం ఉదయనిధి సుప్రీంకోర్టు తీర్పుపై హర్షం వ్యక్తం చేశారు. తమిళనాడు న్యాయ పోరాటం మరోమారు యావద్దేశానికి వెలుగు చూపిందన్నారు. 10 బిల్లులను గవర్నర్ పెండింగ్‌లో ఉంచడం చట్ట విరుద్ధమని, తప్పిదమని సుప్రీంకోర్టు స్పష్టం చేసిందని ఆయన తెలిపారు.

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8: రాజ్యాంగంలోని 200 అధికరణ కింద రాష్ట్ర శాసనసభ ఆమోదించి పంపిన బిల్లులపై నిర్ణయం తీసుకోవడానికి సంబంధించి గవర్నర్‌కు ఉన్న అధికారాలు, బాధ్యతలపై సుప్రీంకోర్టు మంగళవారం చారిత్రాత్మక తీర్పును వెలువరించింది. ప్రజల ప్రజాస్వామిక అభీష్టాన్ని దెబ్బతీయవద్దని గవర్నర్లను హెచ్చరించిన జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్ మహాదేవన్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం.. ఎటువంటి నిర్ణయం తీసుకోకుండా కాలహరణం చేస్తున్న గవర్నర్ల వ్యవహార శైలికి అడ్డుకట్ట వేసేందుకు బిల్లులకు ఆమోదం తెలపడంలో నిర్దిష్ట కాల వ్యవధిని విధించింది. తమిళనాడు అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను ఆ రాష్ట్ర గవర్నర్ ఆర్‌ఎన్ రవి ఎటువంటి నిర్ణయం తీసుకోకుండా తన వద్దే ఉంచుకోవడాన్ని ధర్మాసనం తప్పుపట్టింది. గవర్నర్ చర్యను సవాలు చేస్తూ డీఎంకే ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై ధర్మాసనం వెలువరించిన తీర్పుతో రాష్ట్ర ప్రభుత్వానికి ఊరట లభించింది. రాష్ట్ర అసెంబ్లీలు ఆమోదించిన బిల్లులపై చర్యలు తీసుకోవడంలో గవర్నర్లకు రాజ్యాంగపరమైన కాలవ్యవధి ఉండాలని ధర్మాసనం స్పష్టం చేసింది. పది బిల్లులను తమిళనాడు గవర్నర్ పెండింగ్‌లో ఉంచడాన్ని చట్ట విరుద్ధం, ఏకపక్షంగా సుప్రీంకోర్టు తప్పుపట్టింది. ఈ సందర్భంగా రాష్ట్ర అసెంబ్లీలు ఆమోదించిన బిల్లులపై దేశంలోని గవర్నర్లు సమ్మతి తెలిపేందుకు

### న్యాయ సమీక్షకు గవర్నర్ చర్యలు

రాష్ట్రపతి సమ్మతి తప్పనిసరి కాదన్నంత మాత్రాన గవర్నర్ చర్యలు న్యాయ సమీక్ష నుంచి రక్షణ పొందినట్టు కాదని, గవర్నర్ చర్యలు తీసుకున్నా, తీసుకోకున్నా రాజ్యాంగ పరిధికి, ప్రజాస్వామ్య నిబంధనలకు లోబడి ఉండాల్సిందేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. గవర్నర్ ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తానని ప్రతిజ్ఞ చేస్తారని సుప్రీంకోర్టు గుర్తు చేస్తూ రాష్ట్రానికి రాజ్యాంగాధినేతగా ఉండే గవర్నర్ ప్రజలు ఎన్నుకున్న శాసనసభ్యులకు అడ్డంకులు సృష్టించకుండా ప్రజా సంక్షేమానికి అనుగుణంగా పనిచేయాలని ధర్మాసనం హితవు పలికింది.

అనుసరించాల్సిన మార్గదర్శకాలను సుప్రీంకోర్టు జారీచేసింది. బిల్లులపై సమ్మతి తెలియచేయకుండా శాశ్వతంగా పెండింగ్‌లో ఉంచే అధికారం గవర్నర్లకు లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. గవర్నర్లకు మూడు అవకాశాలు మాత్రమే ఉంటాయని, ఒకటి బిల్లుకు సమ్మతి తెలియచేయడం, రెండు అభ్యంతరాలతో అసెంబ్లీకి బిల్లును తిప్పిపంపడం, మూడు రాష్ట్రపతికి నివేదించడమని సుప్రీంకోర్టు తెలిపింది.

**కాల వ్యవధిపై నిర్దేశం**

రాజ్యాంగంలోని 200 అధికరణ కింద పనిచేయాల్సిన బాధ్యత గవర్నర్లపై ఉందని కోర్టు తెలిపింది. ఒక బిల్లుపై సమ్మతిని ఆపాలన్నా లేదా అభ్యంతరాలు ఉండి రాష్ట్రపతికి నివేదించాలన్నా నెల రోజుల్లోగా గవర్నర్లు నిర్ణయం తీసుకోవలసి ఉంటుంది. బిల్లుపై తమ అభ్యంతరాలను తెలియచేస్తూ గవర్నర్లు 3 నెలల్లోగా అసెంబ్లీకి వాపసు చేయాల్సి ఉంటుంది. బిల్లుపై తన అభ్యంతరాలను రాష్ట్రపతికి తెలియచేయాలనుకుంటే గరిష్ఠంగా మూడు నెలల్లో ఆ పని చేయాల్సి ఉంటుంది. అసెంబ్లీలో రెండోసారి ఆమోదం పొంది వచ్చిన బిల్లుకు నెల రోజుల్లోగా గవర్నర్లు తమ సమ్మతిని తెలియచేయాల్సి ఉంటుంది. గవర్నర్లు సత్వరంగా చర్యలు తీసుకోవాలని రాజ్యాంగం ఆశిస్తుందని, నిర్ణయం తీసుకోవడంలో జాప్యం చేయడం ప్రజాస్వామ్య పాలన స్ఫూర్తిని ఉల్లంఘించడమేనని ధర్మాసనం అభిప్రాయపడింది. రాజ్యాంగపరంగా అత్యున్నత పదవిలో ఉన్న వ్యక్తి చర్యల కారణంగా ఏర్పడిన సంక్షోభాన్ని చక్కదిద్దేందుకు ఈ మార్గదర్శకాలు అవసరమని ధర్మాసనం స్పష్టం చేసింది. బిల్లులకు సమ్మతి తెలియజేయకుండా నిరవధికంగా పెండింగ్‌లో ఉంచే అధికారం గవర్నర్‌కు లేదని కోర్టు స్పష్టం చేసింది. ఏదైనా బిల్లును పునఃపరిశీలనకు పంపాక అసెంబ్లీ మళ్లీ ఆమోదించి రెండవసారి ఆ బిల్లును గవర్నర్‌కు పంపించిన పక్షంలో అటువంటి బిల్లును గవర్నర్ రాష్ట్రపతికి నివేదించడానికి వీల్లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అలా చేయడం చట్టవిరుద్ధమని తెలిపింది. ఒకవేళ రాష్ట్రపతికి నివేదించదలిస్తే నెలరోజుల్లోగా దానిపై గవర్నర్ నిర్ణయం తీసుకోవాలని కోర్టు తెలిపింది. రాష్ట్రపతికి నివేదించాల్సిన అవసరం లేదని భావించిన పక్షంలో మూడు నెలల్లోగా బిల్లులపై గవర్నర్ నిర్ణయం తీసుకోవాలని కోర్టు తెలిపింది. బిల్లులను శాశ్వతంగా పెండింగ్‌లో ఉంచడం ఏకపక్ష చర్యగా పేర్కొన్న ధర్మాసనం.. ఎటువంటి నిర్ణయం తీసుకోకుండా గవర్నర్లు తమ వద్దనే బిల్లులను నిరవధికంగా పెండింగ్‌లో ఉంచుకోవచ్చని రాజ్యాంగంలో ఎక్కడా రాయలేదని తెలిపింది.

**ఆ బిల్లులే రాష్ట్రపతికి సిఫార్సు**

ప్రజల భద్రతకు సంబంధించిన అంశాలు, రాష్ట్రపతి సమ్మతి అవసరమని భావించే అంశాల విషయంలో గవర్నర్లు విచక్షణాధికారంతో వ్యవహరించవచ్చని, 200 అధికరణ ఆ అధికారాలను గవర్నర్‌కు కల్పించిందని ధర్మాసనం వివరించింది. అసెంబ్లీ ఆమోదించిన బిల్లుపై గవర్నర్లు ఎటువంటి నిర్ణయం తీసుకోకుండా ఉండలేరని, వాటిని నెల రోజుల్లోగా తిప్పిపంపి మళ్లీ అసెంబ్లీ ఆమోదం పొందేలా మాత్రమే గవర్నర్ నిర్ణయం తీసుకోగలరని సుప్రీంకోర్టు తెలిపింది. అసెంబ్లీ మరోసారి ఆమోదించి పంపించిన తర్వాత ఆ బిల్లును తిరస్కరించే అధికారం గవర్నర్‌కు ఉండదని కోర్టు స్పష్టం చేసింది.

**గవర్నర్ల తీరుకు ఈ తీర్పు హెచ్చరిక: విజయన్**

బిల్లుల పెండింగ్‌పై తమిళనాడు గవర్నర్ ఆర్‌ఎన్ రవికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు పట్ల కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ హర్షం వ్యక్తం చేశారు. ఫెడరల్ వ్యవస్థను, రాష్ట్ర అసెంబ్లీ ప్రజాస్వామిక హక్కులను సుప్రీంకోర్టు తీర్పు పరిరక్షించిందని ఆయన పేర్కొన్నారు. క్యాబినెట్ సూచన మేరకు గవర్నర్లు పనిచేయాల్సి ఉంటుందని న్యాయస్థానాలు పదేపదే స్పష్టం చేశాయని ఆయన తెలిపారు. బిల్లుల ఆమోదానికి నిర్దిష్ట కాలవ్యవధిని కూడా సుప్రీంకోర్టు నిర్దేశించడాన్ని ఆయన స్వాగతించారు. రాష్ట్ర శాసనసభల అధికారాలను చేజిక్కించుకోవాలని చూస్తున్న గవర్నర్ల తీరుకు ఈ తీర్పు హెచ్చరికని విజయన్ పేర్కొన్నారు. ఈ తీర్పును ప్రజాస్వామిక విజయంగా ఆయన అభివర్ణించారు.



సింగపూర్‌లో అగ్నిప్రమాదం..

## పవన్ కుమారుడికి గాయాలు

సింగపూర్/విజయవాడ: సింగపూర్‌లో మంగళవారం జరిగిన ఓ అగ్నిప్రమాదంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కుమారుడితో పాటు మరో 19 మందికి గాయాలయ్యాయి. ఈ దుర్ఘటనలో పదేండ్ల బాలిక మృతి చెందిందని అధికారులు తెలిపారు. రివర్ వ్యాలీ రోడ్‌లోని మూడంతస్తుల షాప్ హౌస్‌లో మంటలు చెలరేగడంతో ఈ ప్రమాదం జరిగిందని అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో పవన్ చిన్న కుమారుడు మార్క్ శంకర్ (8) చేతులు, కాళ్లకు గాయాలయ్యాయని జనసేన పార్టీ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రమాద సమయంలో ఏర్పడిన పొగ పీల్చడం వల్ల అతడి ఊపిరితిత్తులపై ప్రభావం పడిందని ఆ పార్టీ వెల్లడించింది. శంకర్ ఆరోగ్య పరిస్థితిపై ప్రధాని మోదీ పవన్‌కు ఫోన్ చేసి ఆరా తీశారు. మార్క్ శంకర్ త్వరగా కోలుకోవాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆకాంక్షించారు.

## ఫేస్ అథెంటికేషన్‌తో యూఏఎన్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8: ఫేస్ అథెంటికేషన్ ద్వారా ఈపీఎఫ్‌ఓ ఖాతాదారులు యూనివర్సల్ ప్రావిడెంట్ ఫండ్ అకౌంట్ నంబర్‌ని(యూఏఎన్) జనరేట్ చేయవచ్చని కేంద్ర కార్మిక మంత్రి మన్సుఖ్ మాండవీయ మంగళవారం వెల్లడించారు. ఉమంగ్ మొబైల్ యాప్‌ను ఉపయోగించి ఆధార్ ఫేస్ అథెంటికేషన్ టెక్నాలజీ(ఎఫ్‌ఏటీ) ద్వారా ఉద్యోగి నేరుగా యూఏఎన్‌ని జనరేట్ చేయవచ్చని మంత్రి వివరించారు. కొత్తగా చేరే ఉద్యోగికి ఇదే ఎఫ్‌ఏటీని ఉపయోగించి ఉమంగ్ యాప్ ద్వారా యూఏఎన్‌ని యాజమాన్యం కూడా జనరేట్ చేయవచ్చని ఆయన తెలిపారు. ఇదివరకే యూఏఎన్ ఉండి యాక్టివేట్ చేసుకోని ఉద్యోగులు ఉమంగ్ యాప్ ద్వారా తమ యూఏఎన్‌ని సులభంగా యాక్టివేట్ చేసుకోవచ్చని మాలవీయ అన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే వీసా రద్దు!

- చిన్న కారణానికి పెద్ద శిక్ష
- అమెరికాలో వీసా రూల్స్ మరింత కఠినతరం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8: అమెరికాలో విద్యనభ్యసించేందుకు వెళ్లిన విదేశీ విద్యార్థులు ట్రంప్ విధానాలతో గజగజ వణుకుతున్నారు. ఎప్పుడు ఏ కారణంతో వీసా రద్దు చేసి ఇంటికి పంపుతారో తెలియక దిన దిన గండంగా గడుపుతున్నారు. గతంలో ఎప్పుడైనా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించినా ఇప్పుడు దానికి వీసా రద్దు చేయడం ద్వారా శిక్ష విధిస్తున్నారని అసోసియేటెడ్ ప్రెస్ (ఏపీ) వార్తా సంస్థ మంగళవారం వెల్లడించింది. ఇటీవలి కాలంలో అంతర్జాతీయ విద్యార్థుల వీసాల రద్దు పెరిగినట్టు పలు అమెరికన్ కాలేజీలు వెల్లడించాయి. వీసా రద్దయిన విద్యార్థుల్లో భారతీయులు కూడా ఉన్నట్టు పేర్కొన్నాయి. పాలస్తీనా అనుకూల ప్రదర్శనలతో సంబంధం లేని వారి వీసాలు కూడా రద్దవుతున్నట్టు తెలిపాయి. హార్వర్డ్, స్టాన్‌ఫర్డ్, యూసీఎల్‌ఏ, ఒహాయో స్టేట్ సహా పలు ప్రముఖ యూనివర్సిటీల అధికారులు తాము ఫెడరల్ ఇమిగ్రేషన్ డాటాబేస్‌ను చూసిన తరువాత ఈ విషయం తెలిసిందని అన్నారు.

## 9 లక్షల మంది వలసదారులకు షాక్

**వెంటనే అమెరికాను వీడాలన్న ట్రంప్ సర్కారు**

వాషింగ్టన్: అమెరికాలోని డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం వలసదారులకు మరో షాక్ ఇచ్చింది. గతంలో జో బైడెన్ హయాంలో సీబీపీ వన్ యాప్ ద్వారా అగ్రరాజ్యంలోకి ప్రవేశించిన వారంతా వెంటనే అమెరికాను వీడి వెళ్లిపోవాలని ఆదేశించింది. అమెరికా కస్టమ్స్ అండ్ బోర్డర్ సెక్యూరిటీ విభాగం అభివృద్ధి చేసిన సీబీపీ వన్ యాప్ ద్వారా 2023 జనవరి నుంచి 9 లక్షల మందికిపైగా వలసదారులు అమెరికాలో ప్రవేశించారు.

**అమెరికాను వీడకుంటే రోజుకు రూ.86 వేల జరిమానా**

అమెరికాను వీడివెళ్లని వలసదారులకు రోజుకు దాదాపు రూ.86 వేల మేరకు జరిమానా విధించాలని, ఆ జరిమానా చెల్లించనివారి ఆస్తులను స్వాధీనం చేసుకోవాలని ట్రంప్ సర్కారు భావిస్తున్నది.

# విద్యార్థుల వర్క్ పర్మిట్లకు స్వస్తి!

- *ఓపీటీ ప్రోగ్రామ్ రద్దు కోరుతూ అమెరికా పార్లమెంట్‌లో బిల్లు*
- *భారత విద్యార్థులకు కొత్త టెన్షన్*
- *3 లక్షల మందిపై తీవ్ర ప్రభావం*
- *చదువు పూర్తికాగానే స్వదేశానికే?*
- *ఉద్యోగ అన్వేషణ కోసం మూడేళ్ల నివాసార్హత ఉండదు!*



*న్యూఢిల్లీ, ఏప్రిల్ 8: అమెరికాలో సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్ (స్టెమ్) కోర్సులు చదువుతున్న భారతీయులతో సహా ఇతర దేశాల విద్యార్థులకు కొత్త భయం వెన్నాడుతోంది. చదువులు పూర్తయిన వెంటనే స్వదేశాలకు తిరిగివెళ్లే పరిస్థితి వారికి ఎదురయ్యే అవకాశం ఉంది. ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (ఓపీటీ) వర్క్ ఆథరైజేషన్‌ని రద్దు చేయాలని కోరుతూ పార్లమెంట్‌లో ఓ బిల్లును కొందరు సభ్యులు ప్రవేశపెట్టారు. గ్రాడ్యుయేషన్ పూర్తయిన తర్వాత ఉద్యోగం వెదుక్కునేందుకు మూడేళ్ల వరకు అమెరికాలో నివసించే అవకాశాన్ని ఓపీటీ కల్పిస్తోంది. గతంలో అటువంటి ప్రయత్నాలు విఫలమైనప్పటికీ ప్రస్తుతం అమెరికా ప్రభుత్వం తీసుకుంటున్న కఠిన ఇమిగ్రేషన్ చర్యల నేపథ్యంలో ఈ బిల్లు రావడం విదేశీ విద్యార్థులను భయాందోళనకు గురిచేస్తోంది. ఎన్నికల్లో చేసిన వాగ్దానం మేరకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పటికే విదేశీ అక్రమ వలసదారులను స్వదేశాలకు పంపించే కార్యక్రమాన్ని చేపట్టారు. తాజా పరిణామంతో తమను హెచ్1–బీ వర్క్ వీసాదారులుగా మార్చగల ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకుంటున్న ఎఫ్–1, ఎం–1 స్టూడెంట్ వీసాదారుల్లో భయాందోళనలు మొదలయ్యాయి.*

***3 లక్షల మందికిపైగా..***

*ఓపెన్ డోర్స్ నివేదిక ప్రకారం 2023–24 విద్యా సంవత్సరంలో అమెరికాలో 3 లక్షల మందికిపైగా భారతీయ విద్యార్థులు ఉన్నారు. వీరిలో మూడో వంతు మంది ఓపీటీ పొందేందుకు అర్హులు. ఓపీటీ కింద విద్యార్థులు తమ గ్రాడ్యుయేషన్ పూర్తయిన తర్వాత ఒక ఏడాది పాటు ఉద్యోగాన్వేషణ కోసం అమెరికాలోనే కొనసాగవచ్చు. ఒకవేళ స్టెమ్ గ్రాడ్యుయేట్ అయ్యుండి, క్వాలిఫైడ్ అమెరికా కంపెనీలో పనిచేస్తుంటే దీన్ని మరో రెండేళ్ల వరకు పొడిగించవచ్చని ఇమిగ్రేషన్ న్యాయ సలహా సంస్థకు చెందిన పూర్వీ చోతాని తెలిపారు. ఈ బిల్లు ఆమోదం పొందిన పక్షంలో మరో వర్క్ వీసాకు మారేందుకు అవకాశం లేకుండా అర్ధాంతరంగా ఓపీటీ ముగిసిపోతుందని ఆమె తెలిపారు. ప్రస్తుత నిబంధనల ప్రకారం స్టెమ్ కాని గ్రాడ్యుయేట్లు ఏడాది తర్వాత అమెరికాను వీడాల్సి ఉంటుంది. ఓపీటీ వీసా హోల్డర్లు సాధ్యమైనంత త్వరగా హెచ్–1బీకి బదిలీ కావలసి ఉంటుంది. ఇక కొత్తగా చేరుతున్న విద్యార్థులు తమ చదువులు పూర్తయిన వెంటనే దేశాన్ని వీడాల్సిన బ్రిటన్ తరహా చట్టాలను ఎదుర్కొనడానికి అమెరికాలో కూడా సంసిద్ధంగా ఉండాలని ఆమె తెలిపారు.*

***అమెరికాను వీడొద్దు..***

*ఓపీటీ రద్దు అవుతుందన్న భయం భారతీయ విద్యార్థులను పట్టిపీడిస్తోందని స్టడీ అబ్రాడ్ ప్లాట్‌ఫామ్ కాలేజిఫై సహ వ్యవస్థాపకుడు ఆదర్శ్ ఖండేల్‌వాల్ అన్నారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా లీగల్ వెబినార్లు, ఇమిగ్రేషన్ చర్చా వేదికలే కనపడుతున్నాయని ఆయన చెప్పారు. అమెరికాకు తిరిగిరాక కష్టమవుతుందన్న భయంతో చాలా మంది భారతీయ విద్యార్థులు ఈ వేసవిలో భారత్‌కు వెళ్లాలన్న తమ ఆలోచనను విరమించుకుంటున్నారు. వేసవి సెలవుల కోసం దేశాన్ని విడిచి వెళ్లవద్దని కార్నెల్, కొలంబియా, యాలే యూనివర్సిటీలు తమ విదేశీ విద్యార్థులకు అధికారికంగా సలహా ఇచ్చాయి.*

***ఇతర దేశాల వైపు చూపు..***

*భారతీయ విద్యార్థులు ఇప్పటికీ అమెరికానే తమ గమ్యస్థానంగా భావిస్తున్నారు. అయితే ట్రంప్ ప్రభుత్వం వీసా నిబంధనలను కఠినతరం చేయడంతో ప్రత్యామ్నాయంగా కెనడా, యూరప్‌ను ఎంచుకుంటున్నారు. రానున్న 2025, 2026 బ్యాచుల కోసం అమెరికాయేతర దేశాలకు దరఖాస్తు చేసుకున్న భారతీయ విద్యార్థుల సంఖ్య 20 శాతం పెరిగినట్టు నిపుణులు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తుకు భరోసాను కోరుకుంటున్నారని వారు చెప్పారు. గ్రాడ్యుయేషన్ పూర్తయిన తర్వాత సంపాదన అవకాశాలను విద్యార్థుల కుటుంబాలు ఆశిస్తున్నాయి. అయితే అమెరికాలో చదువు చవకేమీ కాదు. అమెరికాలో చదువుకోవాలంటే ప్రతి విద్యార్థికి ఏడాదికి కనీసం రూ. 51.72 లక్షలు ఖర్చవుతాయని ఖండేల్‌వాల్ తెలిపారు.*

# కర్ణాటక ప్రజలపై మరో పిడుగు

- ప్రైవేట్ బస్ చార్జీలు 15% పెంపు
- వచ్చే నెల నుంచి అమల్లోకి
- డీజిల్, టోల్ చార్జీలు పెరగడం వల్లే రేట్ల పెంపు: బస్ ఆపరేటర్లు

బెంగళూరు, ఏప్రిల్ 8: కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో ప్రజలపై రోజుకో ధరల పిడుగు పడుతున్నది. బస్సు చార్జీలను 15 శాతం పెంచుతున్నట్టు ప్రైవేట్ బస్ ఆపరేటర్లు తాజాగా ప్రకటించారు. వచ్చే నెల నుంచే ఇది అమల్లోకి రానున్నట్టు వెల్లడించారు. డీజిల్‌పై సిద్ధరామయ్య సర్కారు ఇటీవల సేల్స్ ట్యాక్స్ పెంచిన విషయం తెలిసిందే. దీంతో డీజిల్ ధర లీటరుకు రూ.2 పెరిగింది. అలాగే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం టోల్ చార్జీలను 4 శాతం పెంచిన విషయం విదితమే. దీంతో చార్జీలు పెంచక తప్పలేదని ప్రైవేట్ బస్ ఆపరేటర్లు వెల్లడించారు. ఇప్పటికే పెరిగిన ధరలపై కర్ణాటక రవాణా, వాణిజ్య సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు వ్యక్తమవుతున్న తరుణంలో తాజాగా, ప్రైవేట్ బస్‌చార్జీల పెంపు ప్రకటనపై పౌరుల నుంచి మరింత ఆగ్రహం వ్యక్తమవుతున్నది. ఇప్పటికే సిద్ధరామయ్య ప్రభుత్వం పాలు, పెరుగు, చెత్త పన్ను, నీటి చార్జీలు, ఆర్టీసీ చార్జీలు, విద్యుత్ చార్జీలు, దవాఖానా చార్జీలు, మెట్రో చార్జీలు, వాహన రిజిస్ట్రేషన్ చార్జీలు, ఔషధాల చార్జీలు, స్టాంప్ డ్యూటీ, ఎక్సైజ్ డ్యూటీ, పోస్టుమార్టం ఫీజులు పెంచేసి ప్రజలపై తీవ్రమైన భారాన్ని మోపిందని వారు ఆరోపించారు. ఐదు గ్యారెంటీల అమలు పేరుతో ఇలా ప్రతిరోజూ ప్రజలపై మోయలేని భారాన్ని మోపడం ఎంతవరకు సబబు? గెలిపించినందుకు ఇదా మీరు ఇచ్చే బహుమతి అని వారు ప్రశ్నిస్తున్నారు.

# చీర కట్టి.. ఉపాధి కొల్లగొట్టి

- *ఉపాధి హామీ పథకంలో మగువల వేషంలో మగ కూలీలు*
- *కర్ణాటకలో బయటపడ్డ కుంభకోణం*



*బెంగళూరు, ఏప్రిల్ 8: చీర కట్టారు.. కాటుక పెట్టారు.. మెట్టెలు, గాజులు ధరించారు.. తల నిండా చీరను కప్పుకుని అచ్చమైన భారత నారిలా ప్రవర్తించారు. కర్ణాటకలో ఉపాధి హామీ పథకం కూలి కోసం కొందరు మగ కూలీలు ఇలా మహిళలుగా నాటకమాడి రూ.3 లక్షలకు పైగా మొత్తాన్ని కాజేశారు. యాద్గిర్ జిల్లాలో చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్‌ఆర్‌ఈజీపీ) కింద గ్రామీణ ప్రాంతాలకు కేంద్రం ఉపాధి కల్పిస్తున్నది. ఈ పథకం ద్వారా అక్రమంగా లబ్ధి పొందేందుకు కొంతమంది పురుషులు చీరలు ధరించి, బొట్టు, కాటుక పెట్టుకుని మహిళల్లా ఫొటోలు తీసుకుని పంపడంతో వారికి ఆమోదం కూడా వచ్చింది. దీంతో వీరు మహిళల్లా నటిస్తూ రూ.3 లక్షలు ప్రభుత్వం నుంచి పొందారు. ఈ పని వల్ల నిజమైన మహిళా కూలీలకు ఉపాధి లేకుండా పోయింది. దీనిపై ఎవరో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో వారి బండారం బయటపడింది. దీంతో ఒక ఔట్ సోర్సింగ్ ఉద్యోగిని అరెస్ట్ చేశారు.*


## అమల్లోకి వక్ఫ్ చట్టం

- చెల్లుబాటును ప్రశ్నిస్తూ దాఖలైనపిటిషన్లపై 15న సుప్రీంలో విచారణ

న్యూఢిల్లీ: గత వారం పార్లమెంట్‌లో ఆమోదం పొందిన వక్ఫ్ (సవరణ) చట్టం దేశవ్యాప్తంగా మంగళవారం నుంచి అమలులోకి వచ్చింది. ఈ మేరకు మైనారిటీ వ్యవహారాల శాఖ ఒక నోటిఫికేషన్‌ను జారీ చేసింది. వక్ఫ్ చట్టం రాజ్యాంగ చెల్లుబాటును ప్రశ్నిస్తూ దాఖలైన సుమారు 10కి పైగా పిటిషన్లను సుప్రీంకోర్టు ఈ నెల 15 నుంచి విచారించే అవకాశం ఉంది. ఈ కేసుకు సంబంధించి ఆదేశాలు జారీ చేసే ముందు తమ వాదనలను పరిగణనలోకి తీసుకోవాలని కోరుతూ మంగళవారం కేంద్రం సుప్రీంకోర్టులో కేవియట్ దాఖలు చేసింది.

**వక్ఫ్ నిరసనలు హింసాత్మకం**

వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా పశ్చిమ బెంగాల్‌లోని ముర్షిదాబాద్‌లో మంగళవారం చేపట్టిన ఆందోళన హింసాత్మకంగా మారింది. ఆందోళనకారులు రోడ్లను దిగ్బంధించడానికి ప్రయత్నించారు. పలు వాహనాలకు నిప్పు పెట్టారు.



బ్రహ్మకుమారీస్ అధినేత్రి

## దాదీ రతన్ మోహిని కన్నుమూత

జైపూర్: ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయ పరిపాలనా అధినేత్రి, రాజయోగిని దాది రతన్ మోహిని (101) అహ్మదాబాద్‌లోని దవాఖానలో మంగళవారం కన్నుమూశారు. ఆమె అంత్యక్రియలు గురువారం జరుగుతాయని బ్రహ్మకుమారీస్ సంఘం తెలిపింది. ఆమె మృతికి రాష్ట్రపతి ముర్ము, ప్రధాని నరేంద్రమోదీ, రాజస్థాన్ గవర్నర్ హరిభావు బాగ్డే, ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ సంతాపం వ్యక్తం చేశారు. రతన్ మోహిని మరణం తీవ్రంగా బాధించిందని రాష్ట్రపతి అన్నారు. తన బోధనలు, సేవల ద్వారా అనేక మంది జీవితాల్లో ఆమె మార్పు తీసుకొచ్చిందని కొనియాడారు. బ్రహ్మకుమారీల పరిపాలనా అధిపతిగా, ఆమె జీవితం దైవిక అంకితానికి నిదర్శనమని బ్రహ్మకుమారీస్ సంఘం పేర్కొంది.

## ప్రెగ్నెన్సీలో డయాబెటిస్.. పిల్లలకు ఆటిజం ముప్పు

*న్యూఢిల్లీ: గర్భిణులకు మధుమేహం ఉంటే వారికి పుట్టే పిల్లలకు ఆటిజం లాంటి నరాల సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదముందని తాజా అధ్యయనం హెచ్చరించింది. ది లాన్సెట్ డయబెటిస్ అండ్ ఎండోక్రైనాలజీ జర్నల్‌లో ప్రచురితమైన ఈ అధ్యయనం ప్రకారం.. డయబెటిస్ లేని గర్భిణులతో పోలిస్తే ఆ వ్యాధి ఉన్న గర్భిణులకు పుట్టే పిల్లలకు ఆటిజం వచ్చే ముప్పు 25 శాతం, శ్రద్ధ లోపించిన హైపర్ యాక్టివిటీ (ఏడీహెచ్‌డీ) రుగ్మత వచ్చే ప్రమాదం 30 శాతం, మేధో వైకల్యం వచ్చే ముప్పు 32 శాతం ఎక్కువని అధ్యయనం తెలిపింది. అలాగే కమ్యూనికేషన్, అభ్యసనం, కదలికలకు సంబంధించిన రుగ్మతలు వచ్చే అవకాశం కూడా ఎక్కువని అధ్యయనం తెలిపింది. అయితే ఇందుకు సాక్ష్యాధారాలు తక్కువగా ఉన్నాయని తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా గర్భిణులు టైప్ –1, 2 డయబెటిస్ బారిన పడటం పెరుగుతున్నదని శాస్త్రవేత్తలు చెప్పారు. ఊబకాయం, నిశ్చల జీవనశైలి, 35 ఏండ్ల తర్వాత గర్భం దాల్చడం వల్ల గర్భిణులకు డయబెటిస్ వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఈ అధ్యయనం కోసం 200 పాత అధ్యయనాల్లోని 5.6 కోట్ల తల్లీ పిల్లల జతలను పరిశీలించారు. గతంలోని అధ్యయనాలు కూడా గర్భిణికి మధుమేహం ఉంటే దాని ప్రభావం పిండం మెదడు పెరుగుదలపై ప్రభావం చూపుతుందని.. పిల్లల ఆటిజం, ఏడీహెడీ, దీర్ఘకాల నరాల వ్యాధులకు, తల్లి మధుమేహానికి సంబంధం ఉందని సూచించాయి. ఈ విషయమై లోతుగా పరిశోధించాల్సి ఉందని పరిశోధకులు అభిప్రాయపడ్డారు.*

# భయంకరమైన తోడేళ్ల పునఃసృష్టి

- 12 వేల ఏండ్ల కిందటే అంతర్ధానం
- జన్యు మార్పిడి ద్వారా పునర్జన్మ
- అమెరికా శాస్త్రవేత్తల అద్భుతం



టెక్సాస్, ఏప్రిల్ 8: అమెరికా శాస్త్రవేత్తలు అద్భుతం చేశారు. 12,500 ఏండ్ల కిందట అంతర్ధానమైపోయిన జీవులను మళ్లీ సృష్టించారు. జన్యు మార్పిడి ప్రక్రియ ద్వారా 12 వేల సంవత్సరాల కిందట భూమిపై తిరగాడిన డైర్ వోల్ఫ్‌లకు (భయంకరమైన తోడేళ్లు) మళ్లీ ప్రాణం పోశారు. టెక్సాస్‌కు చెందిన కొలోసస్ బయోసైన్సెస్ సంస్థ వీటికి మళ్లీ ప్రాణం పోసింది. ఆరు నెలల వయసున్న రొములస్, రెముస్ ఇప్పటికే నాలుగు అడుగుల పొడవు, 36 కిలోల బరువు ఉండటం విశేషం. ఈ మేరకు 'సీఎన్ఎన్'లో కథనం ప్రచురితమైంది. ఈ జీవులు 'గేమ్ ఆఫ్ థ్రోన్స్' సిరీస్‌లో పాపులర్. టెస్లా వ్యవస్థాపకుడు ఎలాన్ మస్క్ సోషల్ మీడియాలో షేర్ చేయడంతో ఈ వార్త ఇప్పుడు వైరల్‌గా మారింది.

**మూడు జీవులకు ప్రాణం..**

డైర్ వోల్ఫ్ అనేవి భయంకరమైన వేటాడే జంతువులు. చాలా ఎత్తు ఉండే ఇవి ఉత్తర అమెరికాలో జీవించేవి. అంతర్ధానమైపోయిన ఓల్ఫ్ డీఎన్ఏ, వీటిని పోలి ఉండే గ్రే వోల్ఫ్ డీఎన్ఏల క్లోనింగ్, జన్యు మార్పిడి ద్వారా వీటికి తిరిగి ప్రాణం పోశారు. ఇవి గ్రే వోల్ఫ్ కంటే చాలా పెద్దవి. అంతేకాదు, మందమైన ఉన్నితో పాటు వేటాడేందుకు వీలుగా దృఢమైన దవడ కలిగి ఉండేవి. 13 వేల ఏండ్ల కిందటి పన్ను, 72 వేల ఏండ్ల కిందటి పుర్రెల ద్వారా తమ శాస్త్రవేత్తల బృందం డీఎన్ఏలను సేకరించి, పరిశోధనలు జరిపినట్టు కొలొసల్ సహ వ్యవస్థాపకుడు, సీఈవో బెన్ లామ్ వెల్లడించారు. 2024 అక్టోబర్ 1న రెండు మగ ఓల్ఫ్‌లు, 2025 జనవరి 30న ఒక ఆడ వోల్ఫ్‌కు పరిశోధకులు ప్రాణం పోశారు. ప్రస్తుతం జీవించి ఉన్న ఇతర జాతుల తోడేళ్లతో పోలిస్తే వీటి ప్రవర్తన కాస్త భిన్నంగా ఉందని వారు పేర్కొన్నారు.